
**ఈ వారం కథ**

**-పి.ఎస్.నారాయణ**

# స్నేహితుడు



**నాకు అత్యవసరంగా వెయ్యి రూపాయలు కావాల్సి వచ్చినయి. రాత్రి తొమ్మిది గంటలయింది. ఇస్తానన్న వ్యక్తి తెచ్చి ఇవ్వలేదు. రేపు పిల్లవాడికి కాలేజీలో పరీక్ష ఫీజు కట్టేటందుకు ఆఖరి రోజు.**

అనుకోకుండా నాలుగు రోజుల క్రితం మా చెల్లెలు భర్తకు వంట్లో బాగోలేదని తెలిసి మచిలీపట్నం వెళ్లాను. ఈ రోజు ఉదయమే రావటం జరిగింది. నేను ఊరికి వెళ్లకుండా వుండి వున్నట్లయితే ఈ ఇబ్బంది వచ్చి ఉండేది కాదు. ఫీజుల క్రింద కట్టాల్సిన డబ్బును - రెండ్రోజుల్లో వచ్చి వేరే ఏర్పాటు చేద్దాంలే అన్నట్లుగా తీసుకువెళ్ళాను. కాని అక్కడ నుండి తెమిలి బయట పడటానికి ఆలస్యమవడంతో ఈ ఇబ్బంది వచ్చింది.

వస్తూనే మా కొలీగ్ కామేశ్వరరావును కలిసి ఈ విషయం చెబితే సాయంత్రంలోగా ఏదో ఒక ఏర్పాటు చేసాతలే అన్నాడు. ఆ భరోసా మీదనే నేను ఎవరినీ అడగలేదు. కామేశ్వరరావు పత్తా లేడు. మా అబ్బాయి వాళ్ళింటికి రెండుసార్లు వెళ్ళినా దొరకలేదు.

నెలాఖరు అవడంతో మా తోటి గుమాస్తాలను అడిగే అవకాశం లేదు. ఇక మిగిలింది చిదంబరం. గుంటూరులో నాతో కలిసి చదువుకున్నవాడు. మంచి స్నేహితుడు. అతడు ఉద్యోగాల జోలికి వెళ్ళకుండా వ్యాపారంలో పడ్డాడు. ఏవేవో వస్తువుల మార్కెటింగ్ అంటాడు. అటువి ఇటు, ఇటువి అటు తిప్పుతుంటాడు. బాగా సంపాదిస్తున్నవాడే. వాడికి నెలలో మొదటివారం, ఆఖరి వారం అంటూ ఏమీ లేవు. తరచు కలుస్తూనే వుంటాం కాబట్టి వాడి పరిస్థితి నాకు తెలుసు. వాడి పరుసు ఎప్పుడూ నిండుగానే ఉంటుంది.

భోజనం అయింతరువాత చొక్కా తొడుక్కొని బయల్దేరాను. చిదంబరం వుండేది మా పక్కవీధిలోనే. ఇప్పుడయితే ఇంటికి చేరి విశ్రాంతి తీసుకుంటుంటాడు. ఇంతవరకూ ఎప్పుడూ అడిగే అవసరం రాలేదు. తప్పకుండా వాడు ఇస్తాడనే నమ్మకం నాకున్నది.

నేను వెళ్ళేటప్పటికి చిదంబరం ముందు గదిలో కూర్చుని పేపరు చూస్తున్నాడు. నన్ను చూస్తూనే లేచి వచ్చి నన్ను చేయి పట్టుకుని లోపలకు తీసుకువెళ్ళాడు.

'ఇంటికి వచ్చావో లేదో అనుకుంటూ బయల్దేరాను!'

'ఇప్పుడే వచ్చాను షాపు కట్టేసి... ఇంట్లో అంతా గుంటూరు వెళ్ళారు. స్నానం చేసి హోటల్‌కు వెళ్ళి భోజనం చేసి రావాలి!'

'ఎందుకు వెళ్ళారు అంత అర్జంటుగా?'

'వాళ్ళ బాబాయికి వంట్లో బాగో లేదని ఫోనొచ్చింది. నిన్న సాయంత్రమే వెళ్ళారు. ఇందాకనే ఫోను చేశారులే... ఆయన కులాసాగా వున్నాడుట... పెద్దవాడు గదా... ఒకసారి అందరినీ చూడాలనిపించిందట... అందుకనే బంధువులందరికీ ఫోన్లు చేశారట... రేపు వచ్చేస్తున్నారు!' అంటూ చిదంబరం లేచాడు. 'ఈ పేపరు చూస్తుండు... ఈలోగా స్నానం చేసి వస్తాను... మరీ పొద్దుబోయిందంటే ఆ హోటల్ కూడు అధ్వాన్నంగా ఉంటుంది'

పేపర్ చేతిలోకి తీసుకున్నాను. అది నేను తెప్పించే పేపరే అవ్వటంతో అక్కడే పడేసి టేబుల్ మీద ఏవో మ్యాగజైనులు వుంటే - అవేమిటో చూద్దామన్నట్లుగా లేచాను.

చిదంబరం ప్లేట్లో బిస్కెట్లు పెట్టుకొని వచ్చాడు లోపల నుంచి.

'వద్దురా... ఇప్పుడే భోజనం చేశాను!'

'కడుపులో బిస్కెట్ల సంచీ వేరుగా వుంటుంది గాని ఈ రెండూ తినేసేయ్... నేను పది నిమిషాల్లో వస్తాను!' అంటూ లోపలకు వెళ్ళిపోయాడు ఆ ప్లేటు నా ముందు పెట్టి.

బిస్కెట్లు తింటూ టేబుల్ దగ్గరకు వెళ్ళాను. దాని మీద చాలా పుస్తకాలున్నాయి. ఆ పత్రికలన్నీ బహుశః చిదంబరం భార్య కోసమై వుండాలి. వ్యాపారం చేసుకుండే వాడికి ఈ మ్యాగజైన్లన్నీ చదివే ఓపిక, తీరిక ఉంటుందని నేననుకోను.

ఆ పత్రికల పక్కగా వాడి పర్సు వున్నది. చేతి గడియారం ఉన్నది. పెన్ను వున్నది. పర్సు చాలా లావుగా కనపడుతోంది. కనుక తప్పకుండా దాంట్లో డబ్బు చాలా వుండే వుంటుంది. తను అడిగితే కాదనకుండా ఇస్తాడు.

ఒక్కసారి లోపలకు తొంగి చూశాను. బాత్రూంలో నుంచి కుళాయి శబ్దం వినపడుతోంది. వాడు స్నానం చేస్తున్నట్లుగా నీళ్ల చప్పుడు వినపడుతోంది.

పర్సులో ఎంతున్నదో చూడాలనిపించింది క్షణం. వెయ్యికి పైగా వుంటే తన సమస్య తీరిపోయినట్లే.

మనస్సు కాస్త అయిష్టంగా ఊగిసలాడింది. వాడు లేకుండా - వాడు ఎంత మిత్రుడయినా - వాడి పర్సు తీసి చూడటం సభ్యత కాదనిపించింది. పర్సులో ఉండకపోయినా, వ్యాపారస్థుడు కాబట్టి ఇంట్లో బీరువాలోనైనా వుండవచ్చు.

చూసి దాంట్లోనే అంత డబ్బు వుంటే తన ఆందోళన సగం తీరుతుంది. ఉండటం అంటూ తటస్థిస్తే ఇవ్వకపోవటమనే ప్రసక్తీ రాదు.

చేయి పర్సు మీద వేయబోయాను. మనస్సు అయిష్టత వ్యక్తపరిచింది. కానీ ఆలోచనలలో ఆతృత త్వరపెడుతోంది. - నువ్వేం దొంగతనం చేయటంలేదు. అందులో డబ్బు లేదనుకో... అప్పుడు నువ్వు అతడిని అడక్కుండా వుండటమే మంచి పద్ధతి. ఇంట్లో వేరే ఉన్నయ్యో లేవో... ఎప్పుడూ అడగని మిత్రుడు అడిగాడు - సాయం చేయలేక పోతున్నానే అని అతడు బాధపడవచ్చు.

తప్పో... ఒప్పో... అనే ద్వైదీభావనలతో కొన్ని క్షణాలు నా చేతిని వెనక్కూ ముందుకూ లాగింది మనస్సు.

అవసరం, ఆదుర్దా నన్ను ముందుకు తోస్తున్నాయి.

క్షణం కళ్లు మూసుకొని ఓ నిర్ణయానికి వచ్చి ఆ పర్సు

తీసుకొని ఆత్రంగా తెరిచాను. దాన్నిండా డబ్బు వున్నది. ఐదువందల రూపాయల నోట్లు... ఒకటి రెండు వంద నోట్లు, యాభై నోట్లు... చటుక్కున దాన్ని మూసేసి తీసిన చోటే పెట్టేశాను.

మనస్సు కుదుటపడింది. స్థిమితంగా రెండు పత్రికలు తీసుకువెళ్ళి ఎదురుగ్గా కుర్చీలో కూర్చున్నాను.

ఒక సమస్య తీరిపోతుంది. వీడికయితే ఫస్టుకయినా ఇవ్వవచ్చు... ఆపైన రెండు విడతలుగా ఇచ్చినా ఏమీ అనుకోడు.

పత్రికల్లో పేజీలు తిప్పుతూ కూర్చున్నాను.

పావుగంట తరువాత చిదంబరం బయటకు వచ్చాడు. ప్యాంటు, చొక్కా వేసుకున్నాడు. తలదువ్వుకొని పౌడరు రాసుకున్నాడు.

టేబుల్ మీద వాచీ తీసి చేతికి పెట్టుకున్నాడు. పర్సు తీసి జేబులో పెట్టుకున్నాడు.

'పద వెళ్దాం... సెంటర్‌కు వెళ్ళి సుధాలో భోజనంచేస్తూ మాట్లాడుకుందాం... ఆ తరువాత నువ్వు ఇంటికి వచ్చేద్దువుగాని... నాకు వేరే పన్లున్నయి... చూసుకు వస్తాను!'

'అర్ధరాత్రి పూట పనులేమిటి?' అన్నాను నవ్వుతూ.

'వ్యాపారానికి ఒక టైం అంటూ వుండదు... ఎప్పుడు ఎక్కడ నాలుగు రూపాయలు లాభం వస్తుంది అనుకుంటే అక్కడ ఆ పని చేసేయడమే!' అన్నాడు చిదంబరమూ నవ్వుతూ.

'ఒక్క నిముషం కూర్చో... నేనిప్పుడు కార్యార్థినై వచ్చాను... నీ సాయం కావాలి!' అన్నాను కాస్త ఇబ్బందిగా మొఖం పెట్టి.

ఎవరినైనా డబ్బు అడగాలీ అంటే - అప్పుగానైనా సరే - చచ్చే సిగ్గుగా వుంటుంది.

'చెప్పు!' అంటూ ఎదురుగ్గా కుర్చీలో కూర్చున్నాడు వాడు.

'నాకు అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలి... మళ్ళీ ఫస్టుకు ఇచ్చేస్తాను... రేపు చంద్రానికి పరీక్ష ఫీజు కట్టేటందుకు ఆఖరి రోజు... ఈలా అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు... సారీరా!' అంటూ అడిగి తప్పు చేస్తున్నానా అన్నట్లుగా తలవంచుకున్నాను.

వాడు కుర్చీలో నుంచి లేచాడు.

'ఎప్పుడు కట్టాలి డబ్బు?'

'రేపు...!'

'చూస్తాను... ప్రస్తుతమయితే నా దగ్గర లేవు. రేపు మధ్యాహ్నంలోగా ఎక్కడయినా ప్రయత్నిస్తాను!' అన్నాడు ఇంటి తలుపుకు వేసేటందుకుగాను అలమరలో నుంచి తాళం తీసుకుంటూ.

వాడి మాటలకు నా మొఖం తెల్లగా పాలిపోయింది. అవమానించబడ్డట్లుగా శరీరంలోని నరాలన్నీ ముడుచుకు పోయినయి.


ఛీ! పొరపాటున వీడిని ఆత్మీయ మిత్రుడిగా భావిస్తూ అడిగానా అనిపించింది. నా కళ్ళతో చూచాను ఆ పర్సులో నోట్లబొత్తిని... నా లెక్క ప్రకారం పదివేల దాకా ఉండవచ్చు!

నాకు కోపమొచ్చింది. కానీ నోరు తెరిచి - నీ పర్సులో వున్నయి గదరా అని ఎలా అనగలను. అది సభ్యత కాదు. నేను చేసిన పనే అసభ్యకరమైనది.

వ్యాపారస్థులు ఒక రూపాయి లాభముంటేనే గాని ఏ పనీ చేయరేమో... ఫస్టుకు ఇస్తానన్నాను. వారంరోజుల పాటు వెయ్యి రూపాయలు వడ్డీ లేకుండా మిత్రుడికి ఇవ్వటమనేది వ్యాపార లక్షణం కాకపోవచ్చు!

వాడి ముందు నోరు తెరిచి అడిగి అభాసు అయ్యాను అనుకున్నప్పుడు నాకు చాలా బాధ వేసింది. ఈ రోజు బహుదుర్దినం... అవమానం పాలు అవ్వాలని రాసి పెట్టి వున్నదన్నమాట!

రోడ్డు మూలకు వచ్చిన తరువాత, 'నేను ఇంటికి వెళ్తానురా... నువ్వు అటు నుంచి అటే వేరే పని మీద వెళ్తానంటుంటివి కదా... నేనొక్కడినే రావద్దు అంత దూరం



నా గుండె గుభేలుమన్నది. కళ్లు మసక బారుతున్నట్లనిపించింది. రాత్రి వాడి పర్సులో చూసిన నోట్లు దొంగ నోట్లా?

నించి!' అన్నాను. మొట్టమొదటిది నాకు వాడితో వెళ్ళడం ఇష్టం లేకపోవటం అయితే, రెండోది వాడి అబద్ధపు మాటలకు మనస్సు చికాకు పడుతుండటం...

'ఓకే... రేపుదయాన చూద్దాంలే!' వాడు వడివడిగా వెళ్ళిపోయాడు చాలా తేలిగ్గా ఆ మాట అనేసి.

'ఇప్పుడు జేబులో వున్నవి ఇవ్వటానికి ఇష్టంలేకపోయింది - రేపు చూస్తాడట... ఏం చూస్తాడు?' కసిగా అనుకున్నాడు.

ఈ రోజున స్నేహాలు ఇలా ఉన్నాయి - ఇవ్వనని మొఖాన చెప్పలేక 'చూద్దాంలే!' అనటం.

చిన్నప్పటి నుండీ ఎంత స్నేహంగా వుండేవాడు. వాడు మా ఇంటికి వస్తే అమ్మ నాతో సమానంగా టిఫిన్ పెట్టేది. ఆప్యాయంగా చూచేది. వాళ్ళమ్మా తనని అలాగే చూచేది. స్కూల్లో కూడా కలిసి తిరుగుతుండేవాళ్ళం. ఏం కొనుక్కున్నా, ఎవరు కొన్నా - ఇద్దరూ కొనుక్కుండేవాళ్ళం.

రోజులు మారాయి... మనుష్యులు మారుతున్నారు. ఇక ముందు ఇంకెంత అసహ్యంగా తయారవుతారో మనుష్యులు?

ఆశ పెట్టుకున్న మిత్రుడు అభాసు చేశాడు. ఇప్పుడేం చేయాలి? ఎవరిని అడగాలి... నేను పొరబాటు చేశాను... పిల్లవాడు ఫీజు కట్టాలనే ధ్యాస కూడా లేకుండా చెల్లెలు 'ఉందు అన్నయ్యా' అంటే ఉండిపోయాను మచిలీపట్నంలో.

పొద్దున్నే ఏదో ఒకటి చేయాలి. ఇక ఎవ్వరినీ అడగకూడదు. దాని మెళ్ళో చంద్రహారం తీసుకువెళ్ళి మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టి ఎంత వడ్డీకయినా సరే అప్పు తెచ్చుకోవాలి - అంతేగాని వాళ్లనూ, వీళ్ళనూ నమ్మి మోసపోకూడదు!

ఆ స్థిర నిర్ణయంతో ఇంట్లో కాలు పెట్టాను. నన్ను చూస్తూనే మా అబ్బాయి ఎదురువచ్చి, 'నాన్నా! కామేశ్వరరావు అంకుల్ వచ్చి వెయ్యి రూపాయలు ఇచ్చి వెళ్ళారు!' అన్నాడు.

ఆ మాట వింటూనే నా నెత్తిన బరువు తొలగిపోయినట్లుగా ఒక్కసారి హాయిగా శ్వాస పీల్చుకొని నిట్టూర్పు విడిచాను. ఇవాళ్టి రోజు నన్ను ఎంత ఖంగారు పెట్టింది.

ఎంత బరువు తీరినా చిదంబరం ప్రవర్తనా, మనస్సూ నాకు అర్థం గాకుండా చికాకు పరుస్తూనే వున్నది. ఇక వాడితో వీలయినంతవరకూ స్నేహం తగ్గించటమే ఉత్తమం!

అదే నా భార్యతో అంటే, 'మీవైపే మీరు ఆలోచిస్తున్నారు... మీరు చూచిన ఆ డబ్బు ఈ రాత్రికి ఇంకెవరికైనా అత్యవసరంగా ఇవ్వాలేమో... మీకివ్వటం ఇష్టంలేని వాడయితే ఉదయాన ప్రయత్నిస్తానని ఎందుకంటాడు?' అన్నది.

నేను సమ్మతించలేక పోయాను దాని మాటలకు. 'ఆ పడేసేదేదో అడక్క అడక్క అడిగిన నా మొఖాన పడేసి... రేప్పొద్దున్నే ఆ ఇవ్వాల్సిన వాడికి తక్కువయిన వెయ్యి ఎక్కడైనా తీసుకొని ఇస్తే సరిపోయేది గదా... నువ్వెన్నైనా చెప్పు వాడి మాటల్లో నాకు అర్థమయింది. ఊరికినే నాకు ఇవ్వటం వాడికిష్టం లేదు... అసలు నేను తిరిగి ఇవ్వలేక తాత్సారం చేస్తానేమోనని వాడి భయమేమో... వెధవ!' నా మనస్సు కోపంతో రగిలిపోతోంది.

ఆ జరిగిన సంఘటనతో ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

తెల్లవారుజామున అయిదు గంటలప్పుడు మాగన్నుగా నిద్రపడుతున్న సమయంలో - మా పిల్లవాడు నేను పడుకున్న గది ముందు నిలబడి నన్ను పెద్దగా పిలిచాడు.

నేను మంచం దిగి బయటకు వచ్చాను.

'పాలు తెద్దామని బూత్‌కు వెళితే చిదంబరం అంకుల్ ఇంటి ముందు పోలీసులు వున్నారు. ఏదో గొడవ జరుగుతున్నట్లున్నది!' అన్నాడు ఖంగారుగా వాడు.

నేను చొక్కా తొడుక్కొని బయటకు వచ్చి వడివడిగా వాడి ఇంటివైపు అడుగులు వేశాను - ఏమైందో ననుకుంటూ.

మా అబ్బాయి చెప్పింది నిజమే. అక్కడ పోలీసు జీపు వుంది. పోలీసులు ఉన్నారు. ఆ తెల్లవారుఝామున పాల కోసరం వచ్చిన జనం గుంపుగా చేరి గుసగుస లాడుతున్నారు వాడింటివంకే చూస్తూ.

నేను అక్కడకు వెళుతూనే చేతిలో పాల ప్యాకెట్‌తో నిల్చొని వున్న మా వీధిలోని చలపతిని అడిగాను. 'ఏమైంది? ఏమిటా గొడవ?' అంటూ.

'ఎక్కడో దొంగనోట్లు మారుస్తుంటే పట్టుకున్నారట చిదంబరాన్ని... ఇల్లు కూడా సోదా చేస్తున్నారు ఇంకేమైనా దొరుకుతయ్యేమోనని!'.

నా గుండె గుభేలుమన్నది. కళ్లు మసక బారుతున్నట్లనిపించింది. రాత్రి వాడి పర్సులో చూసిన నోట్లు దొంగ నోట్లా?

శరీరమంతా నీరసమావరించింది.

నేననుకున్నట్లుగా వాడు అందులో నుంచి వెయ్యి రూపాయలు నాకిచ్చి వున్నట్లయితే? - ఎంత ఇబ్బందుల్లో పడి వుండేవాడిని నేను?

వాడు ఎందుకు ఇవ్వలేదో ఇప్పుడు నాకు అర్థమయింది.

నేను పట్టుబడితే ఎక్కడ నా పరువు పోతుందో, ఎక్కడ అవమానాల పాలు చెందుతానో అనే భావనతోనే వాడు ఆ డబ్బు నాకివ్వలేదు అని గ్రహించినప్పుడు - చిదంబరం స్నేహానికిచ్చిన విలువకు నా కళ్ళు చెమర్చినయి. వాడిని అపార్థం చేసుకున్నందుకు నేను ఎంతగానో కుంచించుకు పోయాను. ★